క్లుప్తంగా

డీజేఎఫ్ కమిటీలను రద్దు చేశాం



మాట్లాడుతున్న డీజేఎఫ్ ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: జర్నలిస్ట్ డెమొక్రటిక్ ఫెడరేషన్ (డీజేఎఫ్) పేరిట స్వార్థప్రయోజనాల కోసం వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో జాతీయ, రాష్ట్ర కమిటీలన్నీ రద్దు చేశామని డీజేఎఫ్ వ్యవస్థాపక సభ్యులు బీరం తేజోమూర్తి, శ్రీనివాసరావుజాదవ్, మాసం రత్నాకర్, ఏనుగు మల్లారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డీజేఎఫ్ ఆవిర్భావం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగిస్తే.. తనకు తానే జాతీయ అధ్యక్షుడిగా ప్రకటించుకోవడంతో ఆ బాధ్యతల నుంచి తొలగించి కమిటీలు రద్దు చేశామన్నారు. తాత్కాలికంగా రాష్ట్రకన్వీనర్‌గా ఏనుగు మల్లారెడ్డి, కో కన్వీనర్‌గా శ్రీనివాసరావు జాదవ్, జిల్లా కన్వీనర్‌గా నారమల్ల విజయ్‌కుమార్, కో కన్వీనర్‌గా అరికిల్ల జయకుమార్‌ను నియమించామన్నారు. నీలాల శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం కాపాడొచ్చు



వాకర్స్‌కు సీపీఆర్ శిక్షణ ఇస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య

సుల్తానాబాద్: సీపీఆర్‌తో ప్రాణం కాపాడొచ్చని కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీష్ పబ్బ తెలిపారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై ఆదివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. వాకర్స్‌కి నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య శిక్షణ అందించారు. ఎవరైనా హార్ట్ ఎటాక్‌కు గురైతే అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ ఎలా చేయాలనే ఆందోళన ఉంటుందని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండేందుకే సీపీఆర్ శిక్షణ ఇస్తున్నట్లు కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీష్ పేర్కొన్నారు. అనంతరం గుండె జబ్బులు వాటికి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిల రమేశ్, ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుమన్, ఎ.రవీందర్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, ముస్తఫా, ప్రకాశ్‌రావు, కె.ప్రభాకర్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



రైతులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జూలపల్లి: పౌష్టికాహారం అత్యధికంగా లభించే పప్పుధాన్యాల ఉత్పత్తి పెంపునకు రైతులకు ప్రధానిమంత్రి ధన ధాన్య పథకం కింద రూ.35,440కోట్ల నిధులు మంజూరు చేయడంపై బీజేపీ సీనియర్ నాయకులు కంకణాల జ్యోతిబసు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రైతులను సన్మానించారు. నాయకులు బొజ్జ కనుకయ్య, సంకెన్ల నర్సయ్య, రవి, శేఖర్, తీగల అశోక్, భూమయ్య, గుండు సతీశ్, పొద్నాల శేఖర్, గుడూరి నరేశ్ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న కరస్పాండెంట్ ఇస్మాయిల్

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.అభిషేక్ జాతీయస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో అభిషేక్ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాజస్థాన్‌లో ఈనెల 14 నుంచి 17వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతడిని పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్‌ఎం.అఫ్జల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మిక కుటుంబాలపై మరో అద్దె పిడుగు

- పోతనకాలనీ ఏసీ కమ్యూనిటీ హాల్ మరింత ప్రియం
- సింగరేణి కార్మికులకు రూ.25వేలు, కార్మికేతరులకు రూ.50వేలు
- విద్యుత్, క్లీనింగ్ చార్జీలు అదనం



ఏసీ కమ్యూనిటీ హాల్

గోదావరిఖని: ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం నినాదంతో ముందుకు సాగుతున్న సింగరేణి సంస్థ, కార్మికుల సంక్షేమం విషయం మాత్రం గుర్తుంచుకోవడం లేదంటున్నారు కార్మికులు. కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం నిర్మించిన ఏసీ కమ్యూనిటీ హాల్‌కు భారీ అద్దె పేరుతో వడ్డనకు దిగింది. సింగరేణి రామగుండం డివిజన్-2 పరిధిలోని పోతనకాలనీలో ఆధునిక హంగులతో ఏసీ కమ్యూనిటీ హాల్‌ను ఇటీవల నిర్మించింది. దీనిలో వివాహ శుభకార్యాలకు అవకాశం కల్పిస్తూ సంస్థ ఆదేశాలు జారీ చేసింది. కాగా ఆర్జీ-2/పీఈఆర్/37/2025/1891 పేరున శనివారం ఆదేశాలు ఇచ్చారు. నూతన కమ్యూనిటీ హాల్‌కు అద్దెను ఖరారు చేస్తూ అన్ని గనులపై నోటీసులు అంటించారు. ఉద్యోగుల కుటుంబాల కోసం రూ.25వేలు అద్దెగా నిర్ణయించారు. విద్యుత్, క్లీనింగ్ చార్జీలు అదనంగా చెల్లించాలని సూచించారు. అలాగే కార్మికేతరులు ఈ ఫంక్షన్ హాల్ వినియోగిస్తే రూ.50వేలు అద్దె చెల్లించాల్సిందే. దీంతో పాటు ఫంక్షన్‌లో వినియోగించే విద్యుత్‌కు అదనంగా బిల్లు చెల్లించాలి. క్లీనింగ్ ఖర్చులు కూడా ఫంక్షన్ తీసుకున్న వ్యక్తులే భరించాలి. దీంతో శుభకార్యం ఖర్చులు తడిసి మోపెడు కానున్నాయి.

ఆందోళనలో కార్మిక కుటుంబాలు

కొత్త కమ్యూనిటీహాల్ నిర్మాణంతో కార్మిక కుటుంబాలు సంతోషపడ్డాయి. చాలా ఏళ్లుగా కార్మిక కుటుంబాలు ఎదురుచూస్తున్న ఏసీ కమ్యూనిటీ హాల్ పూర్తికావడంతో పెళ్లి సంబరాలు ఇక్కడే నిర్వహించుకోవచ్చని సంబురపడ్డారు. అయితే యాజమాన్యం ఒకేసారి భారీ ఎత్తున అద్దెరేట్లు నిర్ణయించడంతో కార్మిక కుటుంబాల ఆనందం ఆవిరైపోతోంది. కమ్యూనిటీహాల్ అద్దె, విద్యుత్ చార్జీలు, క్లీనింగ్ చార్జీలు, డెకరేషన్, సౌండ్ సిస్టం, పెళ్లి మంటపం ఇలా కార్మికులకైతే రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. అదే కార్మికేతరులకు అయితే రూ.2లక్షలు దాటే పరిస్థితి ఉంది. దీనికన్నా ప్రయివేట్ ఫంక్షన్ హాళ్లలో వేడుకలు నిర్వహించుకుంటే ఎంతో కొంత ఆదా చేసుకోవచ్చని అంటున్నారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు చొరవ తీసుకొని అద్దె రేట్లు నామమాత్రంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.


CIRCULAR

జారీ చేసిన సర్క్యులర్

క్రమశిక్షణకు నిలువుటద్దం ఆర్‌ఎస్‌ఎస్



మంథని: ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



గోదావరిఖనిటౌన్: స్వాగతం పలుకుతున్న కందుల సంధ్యారాణి



జూలపల్లి: పథ సంచలన్ కార్యక్రమంలో స్వయం సేవకులు

మంథని: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు దేశ రక్షణపై, సంస్కృతి, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా ముందుకు సాగుతున్నారని ఆర్‌ఎస్‌ఎస్ ఆరు జిల్లాల సహాయ వ్యవస్థాపకుడు దావునూరి మురళి అన్నారు. మంథని గాంధీచౌక్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ సంస్థలో అయినా పదవుల పంచాయతీ ఉంటుందని, ఆర్‌ఎస్‌ఎస్‌లో మాత్రం క్రమశిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం కార్యవాహ గర్రెపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ విధివిధానాలపై యువత ఎంతో ఆకర్షితులవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బౌద్ధిక్ ప్రముఖ్ లక్కిరెడ్డి అన్వేష్, ధర్మ జాగరణ సేవా ప్రముఖులు మారుపాక నాగన్న, కనుకుంట్ల స్వామి, పెద్దపల్లి వ్యవస్థాపకులు మాడిశెట్టి సుదర్శన్, సురేందర్, కొండపాక సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

‘ఖని’లో పథ సంచలన్

గోదావరిఖనిటౌన్: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ విభాగ్ సద్భావన ప్రముఖ్ కొండేటి బాలరాజు, విభాగ్ సహ కార్యవాహ కొంపల్లి రాజన్న ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నగర కార్యవాహ పైడిపల్లి రామ్మూర్తి, సహ కార్యవాహ మంథెన శ్రీనివాస్, వ్యవస్థా ప్రముఖ్ మధుకర్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు స్వాగతం..

ఆర్‌ఎస్‌ఎస్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పథ సంచలన్ కార్యక్రమానికి ఆదివారం నగర ప్రధాన చౌరస్తాలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు పూలతో స్వాగతం పలికారు.

వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే లక్ష్యం

జూలపల్లి: వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని జిల్లా బౌద్ధిక ప్రముఖ్ తీర్వాటి చంద్రశేఖర్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం మండల ఖండ ఆధ్వర్యంలో గ్రామంలో స్వయం సేవకులు పుర వీధులగుండా కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఖండ బౌద్ధిక్, యాదారం ధర్మాచారి, స్వయం సేవకులు నల్ల మనోహర్‌రెడ్డి, కొప్పుల మహేశ్, గోపాల్‌రెడ్డి, రమేశ్, సాగర్, రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై మంత్రికి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘం నాయకులు

గోదావరిఖనిటౌన్: అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటు విషయంలో అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షపై రాష్ట్ర కార్మిక గనులశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వ్యవహార శైలిని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారు మంత్రిని కోరారు. సంఘం నాయకులు మామిడిపల్లి బాపయ్య, బొంకూరి మధు, మైస రాజేశ్ తదితరులు ఉన్నారు.

శభాష్ పవన్‌కుమార్



సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లెకు చెందిన పిట్టల పవన్‌కుమార్ ఇటీవల గ్రూపు-2 ఫలితాల్లో ఎంపీవో ఉద్యోగం సాధించాడు. కాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఎలిగేడు మండలంలోని శివపల్లిలో సన్మానించారు. నాయకులు కందుల రమేశ్, యాదగిరి సమ్మయ్య, వేల్పుల కృష్ణస్వామి, ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ ఉన్నారు.

రైల్వే ఉద్యోగం పొందిన నవీన్‌కు సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఆశన్నపల్లెకు చెందిన సింగిరెడ్డి నవీన్ ఇటీవల ఆర్‌ఆర్‌బి రైల్వే రిక్రూట్ మెంట్ పరీక్షలు రాసి జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం పొందిన సింగిరెడ్డి నవీన్‌కు మాజీ ఎంపిపి సారయ్య గౌడ్ ఆదివారం శాలువా కప్పి సన్మానం చేశాడు. నవీన్ తల్లి దండ్రులు సులోచన అంజయ్య రైతు కుటుంబానికి చెందిన వారు. తల్లి దండ్రులు ఎంతో కష్టపడి తనను చదివించారని నవీన్ పేర్కొన్నాడు. రైల్వేశాఖలో జూనియర్ ఇంజనీర్ సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్ లో ఉద్యోగం వచ్చిందని నాతల్లి దండ్రుల ప్రోత్సాహంవల్లనే తాను ఇంజనీర్ అయ్యానన్నాడు. మాజీ ఎంపీటీసీలు మంద రమ, పెండ్లి సంపత్, మాజీ సర్పంచు మంద వెంకన్న, నాయకులు గాజుల మోహన్, మంద రాజిరెడ్డి, హరికృష్ణ, అన్వేష్, అర్జున్, రాజేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బసంత్‌నగర్ ఎస్సైగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ



పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా నూతి శ్రీధర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బసంత్‌నగర్ పోలీస్ సిబ్బంది ఎస్సైకి పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఎస్సైగా విధులు నిర్వహించిన ఆర్.స్వామి రామగుండం వీఆర్‌కు బదిలీ అయ్యారు. కాగా నూతన ఎస్సైని బీఆర్ఎస్ మండల నాయకులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బండారి కిరణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ అతిఖ్, ఆడెపు శ్రీనివాస్, ఖాధర్‌పాషా, చందుపట్ల మధుకుమార్, మేకల వెంకటస్వామి ఉన్నారు.

చదువుతో పాటు అన్నిరంగాల్లో ప్రతిభ



వర్షినియాదవ్



అనిరుధ్

సుల్తానాబాద్: అల్ఫోర్స్ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో నలుగురు విద్యార్థులు సత్తా చాటి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆదివారం నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికై న వారిలో అండర్-14 బాలికల విభాగంలో శ్రీవర్షినియాదవ్, బాలుర విభాగంలో ఎం.వాసుదేవ్, అండర్-17 బాలుర విభాగంలో పి.అనిరుధ్, బాలికల విభాగంలో అనన్య ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఆమె నేత్రాలు సజీవం

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో నివాసం ఉంటున్న సూర్యకుమారి(64) అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు మృతురాలి నేత్రాలను దానం చేయడానికి అంగీకరించగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలు సేకరించి హైదరాబాద్ ఎల్వీప్రసాద్ ఐబ్యాంకుకు తరలించారు. కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

● నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ప్రైవేట్ వైద్యుడు బండి మల్లయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలను దానం చేశారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభను నిర్వహించారు. కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి సంస్థ ప్రతినిధులతో కలిసి అభినందన పత్రం అందజేశారు.

● తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన అనపురం మొండయ్య(58) తాటి చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. మధ్యాహ్నం తాటి కల్లు గీసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. వారికి చదువు చెప్పిన గురువులను సత్కరించారు. ఉపాధ్యాయులు శంకర్ ప్రసాద్, శశికళ, కమలాకర్, రమేశ్, సంతోష్‌రెడ్డి, దివ్య, రాంరెడ్డి, క్రాంతికుమార్, వాణి వీణ, అజయ్, బేగం పాల్గొన్నారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కందునూరిపల్లె గ్రామ అనుబంధ గ్రామమైన హన్మండ్లపల్లి రోడ్డుపక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అంతేగాక రోడ్డుకు సమానంగా ఎలాంటి సెక్యూరిటీ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బస్సు పునరుద్ధరించండి



రోడ్డుపైకి వచ్చిన చెట్లకొమ్మలను తొలగిస్తున్న గ్రామస్తులు

- రోడ్డుకి ఇరువైపులా చెట్లకొమ్మలు తొలగించిన చామనపల్లి గ్రామస్తులు

ధర్మారం: మండలంలోని చామనపల్లిలో చెట్లకొమ్మలు రోడ్డుపైకి రావడంతో గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సును సంబంధిత అధికారులు రద్దు చేశారు. దీంతో గ్రామస్తులతోపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గమనించిన గ్రామ యువతతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు రోడ్డుపైకి వచ్చిన చెట్లకొమ్మలను తొలగించారు. చామనపల్లి గ్రామానికి వెళ్లడానికి కటికెనపల్లి నుంచి లేదా కొత్తూరు నుంచి రాకపోకలు సాగుతాయి. ప్రతీరోజు పెద్దపల్లి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు కుమ్మరికుంట, కొత్తూరు మీదుగా చామనపల్లికి వస్తుంది. అక్కడి నుంచి కటికెనపల్లి మీదుగా ధర్మారం చేరుకుంటుంది. అయితే కటికెనపల్లి-చామనపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు రోడ్డుపైకి వచ్చాయి. ఈ పరిస్థితి కొత్తూరు, చామనపల్లి రోడ్డుకు సైతం ఉంది. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఇలాంటి రోడ్డుపై బస్సు నడిపిస్తే ప్రమాదాలు జరుగుతాయని భావించిన ఆర్టీసీ అధికారులు 10రోజులుగా బస్సును రద్దు చేశారు. దీంతో గ్రామస్తులతో పాటు ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇబ్బంది మారింది. గమనించిన గ్రామ యువత, రాజకీయ పార్టీల నాయకులు రోడ్లపైకి వచ్చిన చెట్లకొమ్మలను తొలగించారు. ఆర్టీసీ అధికారులు ఈ రోడ్డును పరిశీలించి వెంటనే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు తీగుళ్ల సతీశ్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో యువకులతో పాటు మాజీ ఎంపీటీసీ వేల్పుల రేవతి నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ అయితరవేని రమేశ్, సురేందర్, తిరుపతి, శివ, నర్సయ్య, లచ్చయ్య, సందినేని సంతోష్, రాములు, సుందరగిరి చందు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లపై పట్టింపు కరువు



ధర్మారంలో దెబ్బతిన్న జిమ్ పరికరాలు

ధర్మారం: ప్రజారోగ్యానికి ప్రాధాన్య ఇస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బహిరంగ ప్రదేశాలు, పార్కులు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జిమ్‌లు నిరుపయోగంగా మారాయి. ధర్మారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ప్రతీరోజు ఉదయం వాకర్స్ వాకింగ్ ముగించుకున్న తర్వాత ఓపెన్ జిమ్‌కు వస్తుంటారు. రోజు మహిళలు, యువత, విద్యార్థులు, క్రీడాకారులు సైతం ఈ జిమ్‌కు వచ్చి వ్యాయాయం చేస్తుంటారు. ప్రస్తుతం వ్యాయామ పరికరాల్లో కొన్ని విరిగిపోగా, మరికొన్ని పరికరాల విడిభాగాలు, వ్యాయామ పరికరాల్లో లోపలి భాగాలు తుప్పుపట్టాయి.

పట్టించుకోవడం లేదు..

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ జిమ్ వ్యాపారులకు, గ్రామస్తులకు అనుకూలంగా ఉంటుందని ఏర్పాటు చేసింది. ఓపెన్ జిమ్ ఏర్పాటు స్థానికులకు ఉపయోగకరంగా మారింది. అయితే జిమ్ పరికరాలను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవటంతో పరికరాలకు అమర్చిన హ్యాండిల్స్ విరిగిపోయాయి. స్థానికులు వెల్డర్ సహకారంతో మరమ్మతు చేయించగా ఆరునెలలకే మళ్లీ మరమ్మతుకు గురికాగా ఎవరూ పట్టించుకోవటం లేదు. దీంతో ఆ పరికరం నిరుపయోగంగా మారింది. ఓపెన్ జిమ్ ఆవరణం పిచ్చిగడ్డితో అపరిశుభ్రంగా ఉందని వాకర్స్ వాపోతున్నారు. అధికారులు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా కొట్టె సదానందం



జనార్దన్‌రావు, క్లబ్ ఉపాధ్యక్షుడు



సదానందం, ప్రధాన కార్యదర్శి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ క్లబ్‌కు అధ్యక్షుడిగా ఆర్డీవో వ్యవహరిస్తారు. కాగా ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా జనార్దన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కొట్టె సదానందం, కల్చరల్ సెక్రటరీగా ఎడ్ల మహేందర్, కోశాధికారిగా కేశెట్టి వేణుతోపాటు కార్యవర్గ సభ్యులుగా మహేశ్, తిరుపతి, మహేందర్, లింగారావు, తొడుపునూరి కృష్ణమూర్తి, వీరేశ్వర్‌రావు, రవీందర్, సదానందం ఎన్నికయ్యారు. వీరికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.